ఉక్కు ఉద్యమంపై ఆంక్షల కత్తి!

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని.. సొంత గనులు కేటాయించి ప్రభుత్వరంగం లోనే కొనసాగించాలన్న డిమాండ్లతో నాలుగున్నరేళ్లుగా కార్మికులు కొనసాగిస్తున్న ఉద్యమాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నాలు సాగుతున్నాయా!.. ఈ ప్రయత్నాలకు అధికార పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారా.. అన్న అనేక ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. కార్మికుల ఉద్యమాల నేపథ్యంలో ఇటీవల చోటుచేసుకొంటున్న సంఘటనలు ఈ ప్రశ్నలకు మరింత బలం చేకూరుస్తున్నాయి.

- గాజువాక

- ఫైలాన్ వద్ద వెలసిన 'ప్రవేశం నిషేధం' బోర్డు
- ఇటీవల టెంట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఆ తర్వాత రోజే వర్షానికి కూలిన టెంట్
- కొత్త టెంట్ నిర్మాణానికి లభించని అనుమతి
- ఇప్పుడు కొత్తగా హెచ్చరిక బోర్డు
- కరపత్రాలు సైతం పంచకుండా ఆంక్షలు

వైఎస్సార్‌సీపీ అండ

గతంలో అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగం లోనే నడపాలన్న డిమాండ్‌కు మద్దతు తెలిపింది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడంతోపాటు అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రధానమంత్రితో కూడా మాట్లాడారు. ఇక్కడి వైఎస్సార్‌సీపీ శ్రేణులు కార్మికుల ఉద్యమాలకు మద్దతుగా నడిచాయి. ప్రభుత్వం మారిన తర్వాత పరిస్థితి మారిందని కార్మికులు పేర్కొంటున్నారు.



స్టీల్‌ప్లాంట్ పైలాన్‌వద్ద వెలసిన హెచ్చరిక బోర్డు

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసిన వెంటనే ఆంధ్రరాష్ట్రం భగ్గుమన్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కార్మిక సంఘాలన్నీ పరిరక్షణ పోరాట కమిటీగా ఏర్పడి 2021 ఫిబ్రవరి 12నుంచి కూర్మన్నపాలెం జంక్షన్‌లోని ఉక్కు పైలాన్‌వద్ద ధర్నా నిర్వహిస్తున్నారు. ఆ ధర్నా ప్రారంభమై ఇప్పటికి 1182 రోజులు పూర్తయింది. దేశంలో ఇటీవల కాలంలో జరిగిన అనేక ఉద్యమాలకంటే ఇది సుదీర్ఘంగా నడుస్తున్న ఉద్యమంగా పేర్కొంటున్నారు. కార్మికుల ఉద్యమానికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంఘాలు, సంస్థలు, కార్మికులు మద్దతు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి పరిరక్షణ పోరాట కమిటీ ఆందోళనను నిలిపివేయించేందుకు పోలీసులు ఒత్తిడి పెంచారు. అందులో భాగంగానే ఇటీవల ఆ టెంట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేశారు. టెంట్‌లో పోలీసులు కూర్చొని కార్మికులను రానివ్వకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఈ విషయం ఇక్కడి ప్రజానీకాన్ని సైతం విస్మయానికి గురి చేసింది. కార్మికులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో ఆ విషయం సద్దుమణిగింది. అయితే, అప్పటికే కురుస్తున్న వర్షం కారణంగా ఆ టెంట్ నేలకూలింది. దరిమిలా కొత్త టెంట్ నిర్మాణం కోసం అనుమతి కోరుతూ కార్మిక సంఘాలు పోలీసులకు దరఖాస్తు ఇచ్చారు. దీనిపై ఇప్పటికీ అనుమతి రాలేదు. కార్మిక నాయకులు పోలీస్ కమిషనర్‌ను కలిసి అనుమతి కోరారు. యోగాంధ్ర తర్వాత మాట్లాడుదామని ఆయన చెప్పడంతో నాయకులు వెనుదిరగక తప్పలేదు.

నిరసనకు సైతం అడ్డుపుల్ల

స్టీల్‌ప్లాంట్‌లో స్ట్రాటజికల్ సేల్‌ను ఉపసంహరించుకొంటున్నట్టు విశాఖ వస్తున్న ప్రధానమంత్రి మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాలు స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం వద్ద ధర్నా నిర్వహించాలని నిర్ణయించాయి. అనుమతి లేదనే కారణంతో ఆ ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. ఇప్పుడు పైలాన్‌వద్ద అకస్మాత్తుగా ప్రవేశం నిషేధం బోర్డు వెలువడింది. ఈ సంఘటనలన్నీ కార్మికోద్యమాన్ని అడ్డుకోవడానికి జరుగుతున్న ప్రయత్నాలేనని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు స్పందించి కార్మికులకు మద్దతుగా నిలవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని అడ్డుకోవడానికి వారు సానుకూలంగా ఉన్నారని భావించాల్సి వస్తుందని అంటున్నారు.

రాత్రికి రాత్రి నిషేధిత ప్రాంతం అయిందా?

1600 రోజులుగా స్టీల్‌ప్లాంట్ కోసం ఆ ప్రాంతంలో ఉద్యమం చేస్తుంటే ఇప్పుడు ఆ ప్రదేశం నిషేధిత ప్రాంతం అయిందా.? ఉద్యమానికి సమాధానం చెప్పలేక దొడ్డిదారిన ఇలాంటి తప్పుడు వాదన చేస్తున్నారు. ప్యాకేజీ ఇచ్చినంత మాత్రాన సరిపోదు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేసి, సొంత గనులు కేటాయించాలి. సెయిల్‌లో విలీనం చేసి, ఉద్యోగుల సమస్యలు పరిష్కారిస్తే మేమే ఉద్యమాన్ని ఆపేస్తాం.

– జె.అయోధ్యరామ్, కో–కన్వీనర్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలి

స్టీల్‌ప్లాంట్ కోసం నాలుగు దశాబ్దాలుగా అనుబంధం ఉన్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు ప్లాంట్ పరిరక్షణ కోసం ఉద్యమం చేస్తుంటే ఆ స్థలాన్ని నిషేధిత ప్రాంతమని చెప్పడం వంటి రెచ్చగొట్టే చర్యలు యాజమాన్యం మానుకోవాలి. స్టీల్‌ప్లాంట్ కట్టిన గోడను కూలగొట్టిన మెడ్‌టెక్‌ను ఏమి చేయలేని ఈ యాజమాన్యం న్యాయంగా ఉద్యమం చేస్తుంటే చర్యలు తీసుకుంటానని చెప్పడం దుర్మార్గం.

– మంత్రి రాజశేఖర్, చైర్మన్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ





పోలీసులు అడ్డుతగిలినా నేలపై కూర్చొని కార్మికుల ఆందోళన (ఫైల్), టెంట్ వేయడానికి అనుమతి ఇవ్వక పోవడంతో గొడుగుల నీడలో ఆందోళన చేస్తున్న కార్మికులు

క్లుప్తంగా

రమణకు పరామర్శ


శస్త్ర చికిత్స చేయించుకున్న రమణను పరామర్శిస్తున్న నాయకులు


కూర్మన్నపాలెం: శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడిని ఆ పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. కాలుకి గాయం కావడంతో ఎన్నేటి రమణ ఆపరేషన్ చేయించుకున్నారు. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపురాము, దుగ్గపుదానప్పలు బి.గోవిందరాజులు, శంకర్రావు తదితరులు పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఉత్సాహంగా యోగాసనాలు


బీవీకేలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, నాయకులు

గాజువాక: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజువాకలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు శుక్రవారం యోగాసనాలు వేశారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ టి.బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కణితి రోడ్‌లోని బీవీకే స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యోగా గురు నరేంద్ర శర్మ, బీజేపీ నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, ప్రసాద శర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాత లు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసి పూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆందోళన

డాబాగార్డెన్స్: మిరాజ్ సినిమా హాల్లో పని చేస్తున్న గిరిజన మహిళను కులం పేరిట దుర్భాషలాడి, అవమానించిన జ్యోతి, వెంకటేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ప్రతినిధులు డిమండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద నిరసన చేపట్టారు. సంఘం ఉపాధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులు, మైనార్టీలపై విపరీతంగా దాడులు పెరిగాయన్నారు. గత ప్రభుత్వంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని, మేము అధికారంలోకి వచ్చాక వీళ్లందరికీ న్యాయం చేస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వ హయాంలో మరింతగా దాడులు పెంచి అన్యాయం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నియోజకవర్గంలో మహిళను చెట్టుకి కట్టి కొట్టిన సంఘటనే ఉదహరణగా పేర్కొన్నారు. ఇప్పటికైనా దళిత, గిరిజన వ్యతిరేక చర్యలు విడనాడాలని, కులం పేరిట దుర్భాషలాడుతూ దాడికి పాల్పడిన జ్యోతి, వెంకటేష్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో సిటు జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కర్రి చంద్రశేఖర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు న్యాయం చేయాలి

గాజువాక: స్థానిక దయాళ్‌నగర్‌లోని టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించి న్యాయం చేయాలని సీపీఐ గాజువాక కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. ఈ గృహాల్లో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం 2025–26 నిధుల నుంచి రూ.103 కోట్లను కేటాయించిందని, ఆ నిధులను మౌలిక వసతుల కల్పనకు ఉపయోగించాలని కోరారు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతుల కల్పన విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ ఇప్పటికే హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేయాలని కోరారు.

జనసమీకరణకు పాట్లు


తిరుమలనగర్ చేరుకున్న బస్సులు


వడ్లపూడి రోడ్డులో పార్కుచేసిన బస్సులు

కూర్మన్నపాలెం: నగరంలో శనివారం జరగనున్న 11వ అంతర్జాతీయ యోగాదినోత్సవానికి జనాలను తరలించే బాధ్యత ఆర్‌పీలకు అప్పచెప్పారు. దీంతో వారు కూర్మన్నపాలెం పరిధిలో ఉన్న డ్వాక్రా సంఘాల సభ్యులు హాజరయ్యేలా గట్టిగానే ప్రయత్నం చేస్తున్నారు. జీవీఎంసీ 86,87వ వార్డుల్లో దాదాపు 30 మంది ఆర్‌పీలు ఉన్నారు. ఒక్కో ఆర్‌పీ పరిధిలో 15 నుంచి 25 వరకు డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఆ సభ్యులను తీసుకుని వెళ్లేందుకు ఆర్‌పీ కి ఒక బస్సు చొప్పున పంపించారు. ఈ లెక్కన వడ్లపూడి తదితర ప్రాంతాలకు సుమారు 30 బస్సులు చేరుకున్నాయి.దీంతో ఆర్పీలు తప్పనిసరిగా హాజరు కావాల్సిందే అంటూ ఆయా గ్రూపుల్లో ఒత్తిడి తెస్తున్నారు. బస్సులన్నీ కాకినాడ జిల్లా నుంచి రావడంతో వాటిని సచివాలయ సిబ్బంది రిసీవ్ చేసుకున్నారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు





సాయినాథుని చరిత్ర పారాయణ చేస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామంలో వచ్చే నెల 18వ వరకు సాయినాథుని చరిత్ర పారాయణ చేయనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ సత్యంబాబు, కార్యదర్శి రవి శేఖర్ తెలిపారు. శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 10న గురుపౌర్ణమిని పురస్కరించుకుని భక్తులందరితో సాయి సచ్చరిత పారాయణంను రోజు కో అధ్యాయం వంతున చేయనున్నామని చెప్పారు.

యోగాతో శారీరక రుగ్మతలు దూరం


యోగా సాధన చేస్తున్న సభ్యులు


యోగా సాధన చేస్తున్న తిరుమలనగర్ వాసులు

పెదగంట్యాడ: రోజూ యోగా చేయడం వల్ల మానసిక, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అయ్యన్నపాలెంలోని గౌతమ్ బుద్ధ యోగా సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విశాఖలో నిర్వహించే మెగా యోగాలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, యోగా గురువు బొడ్డు గిరి, పిట్ట గురునాథ్‌రెడ్డి, దేవాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరులమల నగర్‌లో ..

కూర్మన్నపాలెం: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరుమలనగర్ వాసులు శుక్రవారం రిహార్సల్ చేశారు. చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కాలనీలోని మహిళలు, విద్యార్థులు పెద్దలు హాజరయ్యారు. యోగా గురువులు మెలకువలను వివరించారు.

విద్యార్థి మిత్ర కిట్లు.. కొన్ని కట్

కిట్లలో కనిపించని షూ, సాక్సులు


పూర్తి స్థాయిలో లేని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్

పెదగంట్యాడ: పాఠశాలలు తెరిచి వారం గడిచినా పూర్తి స్థాయిలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను అందంచలేదు. బడి తెరిచిన మొదటి రోజే విద్యార్థులందరికీ కిట్లు పంపిణీ చేస్తామని కొద్ది నెలలుగా ఊదర గొట్టిన కూటమి ప్రభుత్వ పెద్దల మాటలు ఉత్తమాటలేనని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థి మిత్ర కిట్లు పేరుతో యూనిఫాం, బెల్టు, నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, బ్యాగు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు అందిస్తామని పదే పదే ప్రకటనలు గుప్పించారు. కానీ పాఠశాలలు తెరిచి వారం గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందించలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .

గత వైఎస్సార్‌సీపీ హయాంలో..

కూటమి పాలనకు భిన్నంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లల విద్యకు పెద్దపీట వేశారు. బడి వైపు వారిని మరింత ప్రోత్సహించేలా జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. మునుపెన్నడూ లేని విధంగా విద్యార్థులకు అవసరమైన ప్రతి వస్తువును కిట్ల విద్యార్థి కిట్లు రూపంలో పాఠశాలలు తెరిచిన మొదటి రోజే అందజేసేవారు. ఈ సారి అందుకు భిన్నంగా కిట్ల పంపిణీ జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీఐటీయూ నూతన కార్యవర్గం ఎన్నిక


నక్క నాగరాజు, అధ్యక్షుడు


గొలగాని అప్పారావు, ప్రధాన కార్యదర్శి

గాజువాక: జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గాజువాక జోన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. గాజువాకలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆ యూనియన్ 5వ మహాసభలో యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఎం.రాంబాబు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నక్క నాగరాజు, గొలగాని అప్పారావు, కోశాధికారిగా గొల్ల రాము, ఉపాధ్యక్షుడిగా నడిపల్లి రాజు, సహాయ కార్యదర్శిగా బత్తిన మీనాక్షిని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై చర్చించిన ప్రతినిధి వర్గం వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది.

వలస పాలనపై పోరాడిన సాహితీవేత్త గూగి వా థియోంగో


మాట్లాడుతున్న వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్

అల్లిపురం: వలస పాలనలో, వలస అనంతర పాలనలో జరిగిన దోపిడీ పై పోరాడిన సాహితీవేత్త గూగి వా థియోంగో అని వీక్షణం సంపాదకుడు ఎన్. వేణుగోపాల్ అన్నారు. వైవీకే అధ్యయన కేంద్రం, అరసం సంయుక్తంగా విశాఖలో శుక్రవారం నిర్వహించిన గూగివా సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. గూగి వా తొలుత మార్క్సిస్టుగా, చివరిలో మావోయిస్టుగా చెప్పుకున్నారని తెలిపారు. మొదట్లో ఆంగ్ల భాషలో సాహితీ సేద్యం చేసిన ఆయన తర్వాత మాతృభాష గికుయులోనే రచనలు చేశారని అన్నారు. అమెరికాలో ఉంటూ ఆ భాషలోనే సాహితీ పత్రిక నడిపారని తెలిపారు. 1938లో పుట్టిన ఆయన 40 ఏళ్ల కెన్యాలో, మిగతా 47 ఏళ్ల ప్రవాసంలో జీవించారని తెలిపారు. 27వ ఏటే ప్రశ్నించడం ప్రారంభించారని చెప్పారు. కవిత్వం, కథ నాటకాలు, నాటికలు, సాహిత్య విమర్శ, నవలలు, పిల్లల సాహిత్యం సృజించిన గొప్ప వ్యక్తి గూగివా అని పేర్కొన్నారు. మిత్ర సాహితీకి చెందిన విశాఖ వర్మ మాట్లాడుతూ కెన్యా, భారత్ రెండూ బ్రిటిష్ వలస పీడిత దేశాలని చెప్పారు. తేయాకు తోటల్లో పని చేసేందుకు, రైల్వే లైన్లు వేసేందుకు మన దేశం నుంచి అనేక మందిని బ్రిటిష్ పాలకులు కెన్యా తీసుకెళ్లారని తెలిపారు. వారిలో ముకాన్ సింగ్ కార్మిక సంఘాలు స్థాపించారని, కెన్యా స్వాతంత్రం కోసం కృషి చేశారని అన్నారు. స్వాతంత్ర్యానంతరం భారతీయులు కెన్యాలో వ్యాపారులుగా స్థిరపడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మార్క్సిస్టు అధ్యయన వేదిక కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించగా. అరసం ప్రతినిధులు సీఎస్ క్షేత్రపాల్, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గజిబిజి.. గందరగోళం

- **గంటకో** నిర్ణయం... పూటకో ఆదేశం
- **విద్యార్థులు**, ఉపాధ్యాయుల **అయోమ**యం

అగనంపూడి: నెలన్నర నుంచి ఒకటే హడావుడి. **పది రోజుల** నుంచి సమీక్షలు, వెబెక్స్‌లు, సమావేశాల **పేరుతో** గందరగోళం. నాలుగు రోజుల నుంచి **గంటకో నిర్ణ**యం... పూటకో ఆదేశంతో ఉపాధ్యాయులు, **ఇతర** విభాగాల సిబ్బంది, అధికారుల **ఉరుకులు, పరు**గులు.. భారీ ఎత్తున విద్యార్థులను **యోగాంధ్ర** కార్యక్రమానికి తరలించడానికి నానా **హైరానా.. సాధా**రణ ఎన్నికల్లో కూడా కానరాని **హడావుడి ఈ**సారి యోగాంధ్ర కార్యక్రమంలో కనిపించింది. జిల్లా, మండల స్థాయి అధికారులకు నాలుగు రోజుల నుంచి కంటినిండా కునుకు లేదు. కడుపునిండా తిండి లేదు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని పరుగులు పెట్టిస్తూ శుక్రవారం రాత్రి వరకు ఒక స్పష్టమైన విధానానికి ఉన్నతాధికారులు రాకపోవడంతో అన్ని విభాగాలు నానా హైరానా పడ్డారు. శుక్ర, శనివారాల్లో పాఠశాలలకు శెలవని, కాని యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా పిల్లలతో ఉపాధ్యాయులు ఆసనాలు వేయించా లని ఒక రోజు.. శనివారం ఉదయం 6నుంచి 8 వరకు యోగాంధ్ర కార్యక్రమం విధిగా పాఠశాలల్లో నిర్వహించాలని సూచించారు. తర్వాత అల్పాహా రం అందివ్వాలని, మధ్యాహ్నం భోజనం తర్వాత పాఠశాలలు విడిచిపెట్టాలని మరోక్షణం... కొద్ది గంటల్లో నిర్ణయం మార్చుకొని ఉదయం పిల్లలు, ఉపాధ్యాయులు హాజరై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించి ఇంటికి పంపించేయాలని పేర్కొన్నా రు. ఇలా అధికారులకే ఒక పటిష్టమైన నిర్ణయం, అభిప్రాయం లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు గజిబిజి గందరగోళంతో వాట్సాప్ గ్రూపుల్లో, ఫోన్లతో కుస్తీ పడాల్సి వచ్చిందని అన్ని వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి.

ఉద్యోగుల సేవలు స్ఫూర్తిదాయకం


పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి ఉద్యోగు లు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ఈ నెలా ఖరున పదవీ విరమణ చేస్తున్న జి. ఆనంద్(ఎం.ఎం.ఎస్.ఎం), బి.సాయిరామ్ (టెలికామ్)లను శుక్రవారం ఘనంగా సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల కృషి వల్లే ప్లాంట్ అనేక మైలురాళ్ల అధిగమించిందన్నా రు. వారి భావి జీవితం మరింత ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, నాయకులు డొక్క నర్సింగరావు, తాండ్ర కనకరాజు, ఎస్.మోహన్ బాబు, బి.ఎం.ఎల్. నాయుడు, డి. దేముడు, టి. సత్యనారాయణ, గంటా రాజు, చీకటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.